సాక్షి పెద్దపల్లి

సోమవారం । 31 । మార్చి । 2025

ప్రతిభకు సత్కారం



గోదావరిఖనిటౌన్: నగరానికి చెందిన అంతర్జాతీయ కూచిపూడి నృత్య కళాకారిణి గుమ్మడి ఉజ్వలకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఆదివారం జరిగిన ఉగాది కళోత్సవాల సందర్భంగా ఉజ్వల స్వాగత ప్రదర్శన చేసింది. ప్రదర్శనను మెచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమెను అభినందించారు.



వెలుగులు పంచాలి

జ్యోతినగర్ : కొత్త సంవత్సరం ప్రజలందరికీ వెలుగులు పంచాలని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత ఆకాంక్షించారు. గాయత్రీ మాతా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.0/24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చల్లని గాలులు వీచే అవకాశం ఉంది. పగలంతా ఎండగా, ఉక్కపోతగా, అసౌకర్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన జాతీయ మహాసభలు



సమావేశంలో పాల్గొన్న నేతలు

గోదావరిఖని: సీఐటీయూ అనుబంధ ఆలిండియా వర్కర్స్ ఫెడరేషన్(ఏఐసీడబ్ల్యూఎఫ్) జాతీయ మహాసభలు ఆదివారం ముగిశాయి. కోల్‌కత్తాలోని రాంచీలో ఈనెల 28న సమావేశాలు ప్రారంభమయ్యాయి. సింగరేణి నుంచి సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు తదితరులు హాజరయ్యారు. చట్టబద్ధత లేనిలేబర్ కోడ్స్ అమలు చేయడాన్ని నిరసిస్తూ వచ్చేనెల 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీవాత్సవ, ప్రధాన కార్యదర్శిగా డీడీ రామానందం, సింగరేణి నుంచి ఉపాధ్యక్షుడిగా తుమ్మల రాజారెడ్డి, కార్యదర్శులుగా మంద నరసింహారావు, అల్లి రాజేందర్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా మెండె శ్రీనివాస్, మేదరి సారయ్య, విజయగిరి శ్రీనివాస్, కంపేటి రాజయ్య, కుంట ప్రవీణ్, వెంగళ శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు.

లెదర్ ఇండస్ట్రీ భూముల సర్వేకు ఆదేశాలు



హద్దులు లేక అన్యాక్రాంతం

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

రామగుండం: అంతర్గాం మండలం లింగాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబరు 132లో లెదర్ ఇండస్ట్రీకి 2023 నవంబర్ 27న కేటాయించిన 25 ఎకరాల్లో సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పలువురు ప్రతినిధులు తెలిపారు.

తాగునీటికి తప్పిన తిప్పలు

మంథని: మున్సిపల్ పరిధిలో పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ పైపులైన్ నిర్మించలేదు. దీంతో ఎత్తులోని ప్రాంతాలు, దిగువన ఉన్నచోట నీరు సన్నటిధారగా వస్తోంది. సరిపడా నీరు లభించక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గంగాపురి ప్రాంతంలో గతంలో మంచినీరు, ఇతర అవసరాలకు సరిపడా నీరు సరఫరా అయ్యేది. నీటి వృథాను అరికట్టేందుకు మిషన్ భగీరథ అధికారులు క్లోజింగ్ చేయడంతో కేవలం తాగునీటి అవసరాలకే పైపులైన్ ద్వారా నీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో నీటి సమస్య తీవ్రమైంది. ప్రత్యామ్నాయంగా మున్సిపల్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదు. తాగునీటి సమస్యపై మిషన్ భగీరథ అధికారులు ఇటీవల పర్యవేక్షణ చేసి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం కొన్ని ప్రాంతాలు, సాయంత్రం మిగిలిన ఏరియాల్లో నీటిసరఫరా చేయడంతో పట్టణవాసులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

96 శాతం ఆస్తిపన్ను వసూలు



వీరబుచ్చయ్య

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆస్తిపన్ను వసూలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 96.06 శాతం(మార్చి 29వ తేదీ నాటికి) వసూలు చేశామని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వీరబుచ్చయ్య తెలిపారు. మొత్తం 266 పంచాయతీల నుంచి రూ.7,21,08,240 ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా 6,92,68,002(96.06శాతం) వసూలైనట్లు వివరించారు. ముత్తారం(మంథని), కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో నూరు శాతం, అత్యల్పంగా కమాన్‌పూర్ మండలంలో 84.58 శాతం వసూలైనట్లు తెలిపారు. ముత్తారం మండలంలో రూ.32,55,502 (100.18శాతం), కాల్వశ్రీరాంపూర్‌లో రూ.59,49,326, అంతర్గాంలో రూ.46,53,698, పెద్దపల్లిలో 1,09,12,225, ఎలిగేడులో రూ.21,07,097, పాలకుర్తిలో రూ.57,65,145, రామగిరిలో రూ.54,88,211 , మంథని మండలంలో రూ.36,36,400, సుల్తానాబాద్ మండలంలో రూ.84,71,660, ధర్మారంలో రూ. 67,94,884, ఓదెల మండలంలో రూ. 65,18,662, జూలపల్లి మండలంలో రూ.22, 47,490, కమాన్‌పూర్ మండలంలో రూ.34,67,702 ఆస్తిపన్ను వసూలైందని డీపీవో వివరించారు.

ఊరూరా ఉగాది





ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో మేకల బండితో భక్తుల ప్రదర్శన, ఆలయం ఎదుట ట్రాక్టర్లకు పూజలు



కమాన్‌పూర్: ఆదివరాహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



యైటింక్లయిన్‌కాలనీ : అయ్యప్పస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్/ఓదెల: శ్రీవిశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సర వేడుకలను జిల్లావ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే స్నానాలు ఆచరించిన జిల్లావాసులు.. మామిడి ఆకులతో ఇళ్లకు తోరణాలు కట్టారు. భక్ష్యాలు, షడ్రుచులతో కూడిన పచ్చళ్ల తయారు చేసి భుజించారు. సాయంత్రం వేళ ఆలయాలకు వెళ్లి పంచాంగ శ్రవణం గావించారు. కొత్త సంవత్సరంలో భవిష్యవాణి గురించి వేదపండితులు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. ఓదెల శ్రీమల్లికార్జునస్వామి, కమాన్‌పూర్‌లోని ఆదివరాహస్వామి, జనగామలోని శ్రీశివాలయం భక్తులతో రద్దీగా మారాయి. బండ్ల తిరుగుట, వాహన పూజా కార్యక్రమాలు జరిగాయి.

రోజూ.. తాగునీరు

- నీటి సరఫరాకు ట్రయల్ రన్
- దశలవారీగా విస్తరణకు చర్యలు
- బల్దియాలో 13 వాటర్ ట్యాంకులు
- నాలుగింటి పరిధిలో డెయిలీ వాటర్
- 'ఎల్లంపల్లి' ద్వారా ప్రతీరోజు 45 ఎంఎల్‌డీ నీరు సరఫరా
- పర్యవేక్షిస్తున్న రామగుండం బల్దియా కమిషనర్ అరుణశ్రీ

రామగుండం నగర సమాచారం	
డివిజన్లు	50
విస్తీర్ణం(చ.కి.మీ.)	93.47
జనాభా	2,29,644
నివాసాలు	50,956
నల్లా కనెక్షన్లు	40,728



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ప్రతీరోజు తాగునీటిని సరఫరా చేస్తున్న ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర వాసులకు నల్లాల ద్వారా ప్రతీరోజూ రక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు అధికారులు ట్రయల్ రన్ చేపట్టారు. నాలుగు వాటర్ ట్యాంకుల పరిధిలో ప్రతీరోజు తాగునీటిని అందిస్తారు. ఇప్పటివరకు రోజు విడిచి రోజు రక్షిత నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతమైతే.. భవిష్యత్‌లో మరిన్ని వాటర్ ట్యాంకుల పరిధిలో కూడా రోజూ తాగునీటి సరఫరా అమలు చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

నగరంలో 13 వాటర్ ట్యాంకులు..

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 13 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. రామగుండం, భీమునిపట్నం, ఎన్టీపీసీ హెలిప్యాడ్, శారదనగర్, అశోక్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, ఓల్డ్ మున్సిపల్ ట్యాంక్, సీఎస్పీ ట్యాంక్, వెటర్నరీ ఆస్పత్రి ట్యాంక్, విఠల్‌నగర్, ఎలుకలపల్లి, న్యూమారేడుపాక, అల్లూరు పరిధిలోని వాటర్ ట్యాంకుల ద్వారా నగరవాసులకు తాగునీరు అందిస్తున్నారు.

నాలుగు ట్యాంకుల పరిధిలో ట్రయల్ రన్..

ప్రతీరోజు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు నగరంలోని నాలుగు వాటర్ ట్యాంకులను అధికారులు ఎంపిక చేశారు. భీమునిపట్నం, ఎన్టీపీసీ హెలిప్యాడ్, ఎల్కలపల్లి, న్యూ మారేడుపాక ట్యాంక్‌లను ఎంపికచేసిన అధికారులు.. వాటి ద్వారా వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు.

ఎల్లంపల్లి నుంచి 45 ఎంఎల్‌డీ సరఫరా..

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నగరానికి వారం క్రితం వరకు 40 మిలియన్ లీటర్స్ పర్ డే(ఎంఎల్‌డీ) తాగునీరు సరఫరా చేసేవారు. అయితే, ట్రయల్ రన్ కోసం ప్రతీరోజు నాలుగు వాటర్ ట్యాంకుల పరిధిలో మంచి నీటిని సరఫరా చేస్తుండడంతో ఇందుకు అవసరమైన 5 ఎంఎల్‌డీ నీటిని అదనంగా ప్రాజెక్ట్ నుంచి తీసుకుంటున్నారు. మొత్తం కలిపి రోజూ 45 ఏంఎల్‌డీ నీరు అవసరమతోంది.

పర్యవేక్షిస్తున్న కమిషనర్..

ప్రతీరోజు తాగునీటిని సరఫరా చేస్తున్న ట్రయల్ రన్‌పై బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ప్రాంతాలను కమిషనర్ నేరుగా సందర్శిస్తున్నారు. ఆయా కాలనీల్లో పర్యటిస్తూ స్థానికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తున్నారు.

సరిపడా అందిస్తాం

నగరంలో తాగునీటి సరఫరా మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం నాలుగు వాటర్ ట్యాంకుల పరిధిలో ప్రతీరోజు 45 నిమిషాలపాటు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నాం. ప్రెషర్ తక్కువగా ఉండటం తదితర ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాల్లో మరో మూడు వాటర్ ట్యాంకులు నిర్మించడానికి అంచనాలు తయారు చేస్తున్నాం. ప్రతీరోజు సరఫరా చేస్తున్న ప్రాంతాల్లో మీటర్లు ఏర్పాటు చేస్తాం. సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– అరుణశ్రీ, కమిషనర్(ఎఫ్ఏసీ), రామగుండం

పేద కుటుంబాలందరికీ సన్నబియ్యం

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్
- 43వ డివిజన్‌లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ నిరుపేద కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. నగరంలోని 43వ డివిజన్‌లో ఆదివారం ఆయన సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. తెల్లరేషన్‌కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యుడికి ఆరు కిలోలల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్పొరేషన్‌లోని కార్డుదారులకు 89 వేల కింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, వీటితోపాటు మరో పదివేల కొత్త రేషన్‌కార్డుదారులకూ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, ముస్తాఫా, శ్రీనివాస్ పాల్గొన్నారు. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా పవర్‌హౌస్ కాలనీలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన చౌరస్తాలో వీహెచ్‌పీ చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ దంపతులు, వీహెచ్‌పీ ప్రతినిధి అయోధ్య రవీందర్ తదితరులు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులోనూ షడ్రుచుల పచ్చడి పంపిణీచేశారు. నగరంలోని పలు ఈద్గాలను ఎమ్మెల్యే సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అందరూ సుభిక్షంగా ఉండాలి



పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే విజయ్ తదితరులు

పెద్దపల్లిరూరల్: విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లావాసులు అందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణారావు ఆకాంక్షించారు. స్థానిక ప్రగతినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా అర్చకుడు కొండపాక శ్రీనివాసాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ప్రగతినగర్‌లో రెసిడెంట్ టీచర్స్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అమర్‌నగర్ ప్రాంతంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మైనార్టీలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రేడింగ్.. ఫ్రాడింగ్

గతేడాది రూ.7లక్షలపైగా జరిగిన నేరాలు	
సైబర్ క్రైంపోలీస్‌స్టేషన్‌లో..	
నమోదైన కేసులు	43
అరెస్ట్ అయినవారు	20
కోల్పోయిన నగదు	7,94,20,965
ఫ్రీజింగ్ చేసిన నగదు	1.39,26,190
స్వాధీనం చేసుకున్న నగదు	62,12,577

రూ.7 లక్షలలోపు సైబర్ నేరాలు	
పోర్టల్ ద్వారా ఫిర్యాదులు	1,348
నమోదై కేసులు	147
కోల్పోయిన నగదు	2,37,17,374
ఫ్రీజింగ్ చేసిన నగదు	52,48,125
స్వాధీనం చేసుకున్న నగదు	23,60,532

- ఆన్‌లైన్ వ్యాపారం పేరిట బురిడీ
- ఆశచూపించి రూ.లక్షల్లో కొల్లగొడుతున్న కేటుగాళ్లు
- ఖాతాలో రూ.లక్షలు కనిపిస్తాయి.. చేతికి పైసా రాదు
- ఇటీవలే ఓ ఉపాధ్యాయుడి నుంచి రూ.57లక్షలు స్వాహా
- రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్లు..



రామగుండం సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్

గోదావరిఖని: సైబర్ నేరగాళ్లు ప్రజలను బురిడీ కొట్టించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇందుకోసం వారు రోజుకో మార్గం ఎంచుకుంటున్నారు. నిన్నామొటి వరకు డిజిటల్ అరెస్ట్.. గోల్డ్ ట్రేడింగ్ పేరిట మోసాలకు పాల్పడిన దగాకోరులు.. ప్రస్తుతం ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ప్రజలకు వల విసురుతున్నారు. తొలు రూ.లక్షకు రూ.2 లక్షలు, రూ.2లక్షలకు రూ.4 లక్షల లాభాలు వస్తున్నాయంటూ ఆన్‌లైన్‌లో మెసేజ్ చూపిస్తున్నారు. ఆ తర్వాత సైట్ మూసేస్తున్నారు. ఇటీవల ఇలాంటి మోసమే రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు సైబర్‌మోసగాళ్ల బారినపడి దశల వారీగా రూ.57లక్షలు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టి మోసపోవడం కోల్‌బెల్ట్‌లో చర్చనీయాంశంగా మారింది.

మోసాలు.. అనేక రకాలు..

డిజిటల్ అరెస్ట్, జంప్‌డ్ డిపాజిట్ మనీ, మల్టీలెవల్ మార్కెటింగ్ తదితర వాటి పేరిట సైబర్ మోసగాళ్లు ఇప్పటిదాకా బ్యాంకు ఖాతాలు కొల్లగొట్టారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ అరచేతిలో ప్రపంచం చూపిస్తోంది. బ్యాంక్‌లావాదేవీలన్నీ యూపీఐ, ఫోన్‌పే, గూగుపే.. లాంటివన్నీ బ్యాంక్ లింక్‌ల ద్వారానే సాగుతున్నాయి. ఈక్రమంలో సైబర్‌నేరగాళ్లు ఇప్పుడు ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు ఎంచుకుని మోసాలకు పాల్పడుతున్నారు.

ఉత్తరప్రదేశ్ నుంచే..

సైబర్‌నేరగాళ్లు ఎక్కువగా బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు ఉంటున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. కాంబోడియా కేంద్రంగా సైబర్ నేరగాళ్లు ప్రజలకు వల విసురుతున్నారు. పెద్ద కార్యాలయాలు ప్రారంభించి తమకు సమీప, తెలిసిన వారితో బ్యాంకు ఖాతాలు ప్రారంభిస్తున్నారు. తాము కొట్టేసిన సొమ్మును తొలుత ఈ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు. ఖాతాదారులకు సంబంధం లేకుండా ప్రతినెలా రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు బ్యాంకు కస్టమర్లకు పంపించడంతో వారు కూడా కిమ్మనకుండా ఉండిపోతున్నారు.

అత్యాశకు వెళ్లొద్దు



ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో పెట్టుబడి పెడితే పెద్దమొత్తంలో లాభాలు వస్తాయని కొందరు ఆశపడుతున్నారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసగాళ్లు తొలుత రూ.లక్ష వరకు పెట్టుబడి పెడితే రూ.2 లక్షల లాభాలను ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. దీంతో తమకు లాభాలు వస్తున్నాయని ఆశపడుతూ ప్రజలు మళ్లీ పెట్టుబడి పెడుతున్నారు. ఆ తర్వాత మోసపోతున్నారు. ఇటీవల ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇలానే ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.57లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. జిల్లావాసులు ఇలాంటి వ్యాపారాలపైనా అప్రమత్తంగా ఉండాలి.

– వెంకటరమణ, ఏసీపీ, సైబర్‌క్రైం, రామగుండం

రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలని ఆదేశాలు

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులను ఈనెలాఖరులోగా తొలగించాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఆయా శాఖలకు ఆదివారం ఉత్తర్వులిచ్చింది. అంతేకాదు.. రిటైర్డ్ ఉద్యోగల జాబితాను పంపించాలని అధికారులకు సూచించింది. ప్రభుత్వం కూడా ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో సింగరేణి ఈ నిర్ణయం తీసుకుంది.

మక్కకు పందుల బెడద

- కంకిదశలోకి పంట.. దిగుబడిపై ఆశ
- చేతికందే దశలో ధ్వంసం చేస్తున్న ఊరపందులు
- రక్షణ కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు అన్నదాతల మొర



రంగంపల్లిలో ఊరపందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న కర్రలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొక్కజొన్న పంటకు అడవిపందులతోపాటు ఊరపందుల బెడద పట్టుకుంది. కొన్ని మారుమూల గ్రామాల్లో ఊరపందులు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామ శివారులోని మొక్కజొన్న చేనుల్లోకి దూరి పంట ధ్వంసం చేస్తున్నాయి. అన్నదాతకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. పెద్దపల్లి శివారులోని రంగంపల్లిలో ఈ పరిస్థితి తీవ్రస్థాయిలో ఉంది. పంట ప్రస్తుతం కంకిపోసి కొద్దిరోజుల్లో దిగుబడి చేతికి వచ్చే అవకాశం ఉంది. ఈ సమయంలో ఊరపందులు చేలల్లోకి దూరి మొక్కజొన్న పంటను ధ్వంసం చేయడం రైతుల్లో విషాదం నింపుతోంది.

అన్నదాతలు కాపలాగా ఉన్నా..

పందుల బారినుంచి పంటను కాపాడుకునేందుకు రైతు కుటుంబసభ్యుల్లో ఎవరోఒకరు మొక్కజొన్న చేను వద్ద రోజూ కాపలా ఉంటున్నారు. అయినా, వారి కళ్లుగప్పి పందులు గుంపులుగా వచ్చి ఒక్కసారిగా చేనులో పడి ధ్వంసం చేస్తున్నాయి. ఈ విషయాన్ని పందుల పెంపకందారుల దృష్టికి తీసుకెళ్లినా కట్టడి చేస్తామంటున్నా.. క్షేత్రస్థాయిలో తగిన చర్యలు చేపట్టడం లేదని అంటున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..

పందుల బెడదతో తమకు జరుగుతున్న నష్టాల గురించి వివరిస్తూ ఫొటోలు, వీడియోలతో అధికారులు, ప్రజాప్రతినిధులకు బాధిత రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా, తమ విన్నపాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదని రైతులు రాజారాం, ప్రభాకర్, నరేశ్, తిరుపతి, కిష్టస్వామి, రవి, శంకర్ తదితరులు పేర్కొన్నారు. పోలీసు అధికారులకు సైతం ఫిర్యాదు చేసి, పందుల పెంపకందారులకు ఆదేశాలు ఇప్పించినా పరిస్థితిలో మార్పు రావడం లేదంటున్నారు.



ఈ ఫొటోలోని రైతు పేరు పూదరి లక్ష్మణ్. స్వగ్రామం రంగంపల్లి. తను సాగు చేసిన మొక్కజొన్న పంట కంకిపోసింది. కొద్దిరోజులైతే పంట కోయడం కోసం సిద్ధమవుతున్నాడు. సరిగ్గా ఇదేసమయంలోనే ఊరపందులు చేనులోపడి పంట ధ్వంసం చేశాయి. తీరని నష్టం కలిగించాయి. చేతికందే దశలో పంట నాశనం కావడంతో శ్రమంతా మట్టిపాలైందని, పెట్టుబడి కూడా వచ్చేట్టు లేదని లక్ష్మణ్ ఆవేదన చెందుతున్నాడు.

రక్షణ కల్పించాలి



మా ఊరు శివారులో నాకున్న చేనులో మొక్కజొన్న పంట వేసిన. ఊరపందులు చేనులోపడి కంకిని కొరికి పడేస్తున్నాయి. కర్రలను విరిచేస్తున్నాయి. మాకు తీరని నష్టం కలుగుతంది. వాటి బారినుంచి పంటను కాపాడాలి. నష్టపోయిన పంటకు పరిహారం ఇప్పించాలి.

– వైద రమేశ్, రైతు, రంగంపల్లి

పంటల బీమా చేయాలి

ప్రకృతి వైపరీత్యాలతో కలిగే పంటల నష్టానికి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదించే అవకాశం ఉంది. ఊరపందులు చేసే నష్టం విషయాన్ని సర్కార్ దృష్టికి తీసుకెళ్లడం కష్టమే. పందులు చేనువైపు రాకుండా రైతులే రక్షణ చర్యలు తీసుకోవాలి. లేదా పెంపకందారులతో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలి.

– అలివేణి, ఏవో, పెద్దపల్లి

క్లుప్తంగా

సాగు పనులు ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



నాగలిపట్టి దుక్కి దున్నుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం దన్వాడలో వ్యవసాయ పనులు ప్రారంభించారు. తన వ్యవసాయ క్షేత్రంలో నాగలి పట్టి దుక్కిదున్ని సాగు బాటు మొదలు పెట్టారు. అంతకుముందు శ్రీదత్తాత్రేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నారి మృతదేహం లభ్యం



దాస్ గెల్వి(ఫైల్)

రామగిరి(మంథని): ఎస్సారెస్పీ డీ–83 కాలువలో పడిగల్లంతైన దాస్ గెల్వి(2) మృతదేహాన్ని పోలీసులు ఆదివారం వెలికితీశారు. కల్వచర్ల శివారులోని ఎస్‌బీకే ఇటుక బట్టీలో పనిచేస్తున్న దాస్ సుజిత – సాగర్ దంపతుల కుమార్తె దాస్ గెల్వి(2) శనివారం ప్రమాదవశాత్తు కాలువలోపడి గల్లంతయ్యింది. దీంతో ఎస్సై చంద్ర కుమార్, దివ్య ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఆదివారం మృతదేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇటుక బట్టీల్లో అల్లారుముద్దుగా తిరుగుతున్న చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కార్మికులు విషాదంలో మునిగారు.

అగ్ని ప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన సామగ్రి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన బేతి లక్ష్మారెడ్డి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. లక్ష్మారెడ్డి ఇంట్లో ఆల్ ఆవుట్ పెట్టి డోర్లు మూసి బయటకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఆల్ ఆవుట్ ప్లగ్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఉన్న బట్టలతో పాటు నిత్యావసర సామగ్రి బియ్యం, నువ్వులు, రూ.60వేల పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

రాజన్న ఆలయ అర్చకుడికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకున్న కటుకూరి వెంకన్న

వేములవాడ: విశ్వావసు నామ సంవత్సరం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం పలు ఆలయాల అర్చకులకు ఉగాది పురస్కారాలు అందజేసింది. రాజన్న ఆలయ ఉపప్రధాన అర్చకుడు కటుకూరి వెంకన్న, వేదపారాయణదారు జగన్మోహన్‌లకు రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ శాలువతో సత్కరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసు

పాలకుర్తి(రామగుండం): ముంజంపల్లి గ్రామశివారులో ఇసుకను అక్రమంగా నిల్వచేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు. గోదావరి నదీపరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తీసుకువచ్చి ఎండపల్లి మండలం ముంజంపల్లి శివారులో నిల్వ చేస్తున్నారు. రాత్రివేళల్లో లారీల ద్వారా హైదరాబాద్, జగిత్యాల జిల్లాల్లోకి తరలించి విక్రయిస్తున్నారు. ఈమేరకు అందిన సమాచారంతో పోలీసులు ఇసుక స్థావరాలపై దాడి చేశారు. జేసీబీ, రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈదందా నిర్వహిస్తున్న బుర్రి మహిపాల్, ముంజాల సురేశ్, తనుగుల తిరుపతి, తనుగుల సురేశ్, వాసం సతీశ్‌తోపాటు గుమ్ముల రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మామిడి కొనుగోళ్లపై అనిశ్చితి

- ఓపెన్ మార్కెటా..? కమీషన్ మార్కెటా..?
- అయోమయంలో మార్కెట్ అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు, వ్యాపారులు



జగిత్యాలలోని మామిడి మార్కెట్

జగిత్యాలఅగ్రికల్చర్: మామిడి కొనుగోలు సీజన్ త్వరలోనే ప్రారంభంకానుంది. ఈ క్రమంలో జగిత్యాల (చల్‌గల్)లోని మామిడి మార్కెట్‌లో మామిడి కొనుగోళ్లు ఎలా చేపట్టాలనే అంశంపై అనిశ్చితి నెలకొంది. వ్యాపారుల్లో ఓవర్గం ఓపెన్ (బహిరంగ వేలం) పద్ధతిలో కొనుగోళ్లు చేపట్టాలని చూస్తుండగా.. మరోవర్గం కమీషన్ ప్రతిపాదికన చేయాలని భావిస్తున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఏ నిర్ణయం తీసుకుంటే ఏమవుతుందోనని మార్కెట్ అధికారులు సతమతం అవుతూ తాత్సారం చేస్తున్నారు.

జూన్ వరకు కొనుగోళ్లు

జగిత్యాల మామిడి మార్కెట్‌లో కొనుగోలు చేసిన బంగినపల్లి, దశేరి, హిమాయత్ తదితర రకాల మామిడి కాయలు నాణ్యతగా ఉంటాయనే పేరుంది. ఇక్కడి కాయలకు ఢిల్లీ, నాగ్‌పూర్, చండీఘర్, హర్యానా, పంజాబ్, జమ్మూ, కాశ్మీర్, బంగ్లాదేశ్, దుబాయ్ వంటి దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఆయా ప్రాంతాల వ్యాపారులు మామిడి సీజన్ రాగానే ఈ ప్రాంతంపై వాలుతుంటారు. మామిడి మార్కెట్ సీజన్ ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభమై.. జూన్ మొదటి వారం వరకు ఉంటుంది. మామిడి మార్కెట్‌లో ఓ పద్ధతంటూ లేకపోవడంతో గతేడాది కొందరు వ్యాపారులు ఓపెన్‌మార్కెట్‌లో కొనుగోలు చేశారు. మరికొందరు కమీషన్ పద్ధతిలో కొన్నారు. ఈ సీజన్‌లో ఏ పద్ధతిలో కొనుగోలు చేస్తారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో వ్యాపారులు, అధికారులు, రైతుల్లో అయోమయం నెలకొంది.

కమీషన్ పద్ధతిలో ఇలా..

మామిడి కొనుగోలుకు మార్కెట్ కమిటీ నుంచి వ్యాపారులు లైసెన్స్ తీసుకుంటారు. మార్కెట్‌లో షెడ్లు ఏర్పాటు చేసుకుని షెడ్లకు వచ్చిన కాయలను బట్టి ఎవరికి వారే కొనుగోలు చేస్తుంటారు. రైతులు తోటలోని నాలుగైదు కాయలను శాంపిల్‌గా తీసుకొచ్చి వ్యాపారులకు చూపిస్తుంటారు. వ్యాపారులు ఆ కాయల నాణ్యత, పరిమాణం బట్టి ధర నిర్ణయిస్తుంటారు. వ్యాపారులు చెప్పిన రేటు నచ్చితే రైతులు కాయలను తెంపుకొని వచ్చి విక్రయిస్తుంటారు. ఈ పద్ధతిలో రైతులకు అన్యాయం జరుగుతుందని కొందరు వాదిస్తున్నారు. మామిడి శాంపిల్స్ తీసుకొచ్చిన సమయంలో ఓ రేటు.. మొత్తం కాయలు తీసుకొచ్చిన తర్వాత తిరకాసు పెట్టి రేటు తగ్గిస్తున్నారని, దీంతో రైతులు ఏమీ చేయలేక ఏదో ధరకు విక్రయించాల్సి వస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా సూట్, రాటన్, క్యాష్ కటింగ్ పేర రైతులను ఇష్టారీతిన దోచుకుంటున్నారని అంటున్నారు.

ఓపెన్ మార్కెట్‌లో ఇలా..

ఓపెన్ పద్ధతిలో కొనుగోళ్లు జరిపితే రైతులకు న్యాయం జరుగుతుందనేది మరికొందరి వాదన. ఈ పద్ధతిలో లోకల్ వ్యాపారులు కాకుండా ఢిల్లీ, నాగ్‌పూర్ వంటి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొంటారు. తద్వారా వ్యాపారుల్లో పోటీ పెరిగి రైతులకు ఎక్కువ ధర వచ్చే అవకాశం ఉంది. ఓపెన్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన కాయలను వెంటనే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడం సాధ్యం కాదని, కాయలు చెడిపోతాయని చెబుతున్నారు. ఈ విధానంలో రైతుల నుంచి నాలుగు శాతం కమీషన్ కట్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఓపెన్ పద్ధతిలో కొనుగోళ్లు సాగితే మార్కెట్‌కు భారీగా ఆదాయం వస్తుంది. ఓపెన్ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రేటు తగ్గించే అవకాశం కూడా ఉందని, తాము కొనుగోలు చేయమని మొండికేస్తే కాయలను ఎక్కడికి తీసుకెళ్లి అమ్ముకోవాలనే దానిపై రైతులు ఆందోళన ఉంది.

నిస్సాహాయ స్థితిలో అధికారులు

మార్కెట్ నిబంధనల ప్రకారం మామిడి కొనుగోళ్లు ఓపెన్ పద్ధతిలో కొనుగోళ్లు చేపట్టాలి. కొందరు రైతులు, వ్యాపారులు ఓపెన్ మార్కెట్‌ను వ్యతిరేకిస్తుంటే.. మరికొందరు రైతులు, వ్యాపారులు



గత ఏడాది వ్యాపారులు కొనుగోలు చేసిన మామిడి కాయలు

కమీషన్ ప్రతిపాదిత మార్కెట్‌ను బలపరుస్తున్నారు. దీనికితోడు మార్కెట్ అధికారులు వ్యాపారులపై నిబంధనల ప్రకారం ఒత్తిడి తెస్తే రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు, చీవాట్లు. దీంతో రైతులు, వ్యాపారులు, రాజకీయ నాయకుల మధ్య మార్కెట్ అధికారులు నలిగిపోతూ ఏమి చేయలేని నిస్సాహాయ స్థితిలో ఉండిపోయారు. మామిడి మార్కెట్‌లో కఠిన నిబంధనలు అమలు చేస్తేనే మామిడి మార్కెట్ ఓ దారికి వచ్చే అవకాశం ఉంది. ఎవరి ఇష్టారీతిన వారు వెళ్తుండడంతో చివరకు రైతులు బలవుతున్నారు. ఓ సమావేశం ఏర్పాటు చేసుకుని అందరితో చర్చించి, ఇతర పండ్ల మార్కెట్ల మాదిరిగా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని రైతులు చెబుతున్నారు.

నిబంధనలు అమలు చేయాలి



మామిడి మార్కెట్‌లో నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుంది. కొన్నేళ్లుగా కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారడంతో మార్కెట్‌కు రావాలంటేనే రైతులు భయపడే పరిస్థితి ఉంది. ఎవరి ఇష్టానుసారం వారు కొనుగోళ్లు చేస్తూ చివరకు రైతులను బలిపశువును చేస్తున్నారు.
– కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, మామిడి రైతు, మేడిపల్లి

అమలు చేస్తాం



మామిడి మార్కెట్‌లో నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తాం. మామిడి మార్కెట్‌పై పూర్తి స్థాయిలో చర్చించేందుకు వ్యాపారులు, రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటాం. రైతులకు ఎట్టి పరిస్థితిలో అన్యాయం జరుగకుండా చూస్తాం.
– ప్రకాశ్, జిల్లా మార్కెట్ అధికారి

ఈద్ ముబారక్

- నేడు ఈద్ ఉల్– ఫితర్



కరీంనగర్‌కల్చరల్: ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువ పెంచే పండుగ రంజాన్. ఈ పవిత్రమైన పండుగ కోసం ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాస దీక్ష చేశారు. ఆదివారం రాత్రి నెలవంక దర్శనం ఇవ్వడంతో సోమవారం రంజాన్ పండుగ జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధం అవుతున్నారు. షాబాన్ మాసంలో నెలవంక దర్శనం అనంతరం ఉపవాస దీక్షలు ప్రారంభించి, దైవకటాక్షం కోసం పరితపిస్తారు. ఉదయం సహర్, సాయంత్రం ఇఫ్తార్ విందులు రంజాన్ నెలలో ప్రత్యేకత. దానధర్మాలు, స్వచ్ఛమైన జీవన విధానాన్ని అలవరుచుకునేందుకు ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని అనువైన సందర్భంగా భావిస్తారు. మోక్షానికి యోగ్యమైన మానవ జన్మను ప్రసాదించిన కారణంగా దేవుడికి సహృదయంతో కృతజ్ఞతలు చెప్పే అరుదైన పండుగ రంజాన్. పండుగ రోజు పుట్టినవారికి కూడా ఫిత్రా ఇవ్వాల్సి ఉంటుంది. ఫిత్రాల పేరు మీదనే ఈ పండుగను ఈద్ ఉల్ ఫితర్ అని పిలుస్తుంటారు. మార్కెట్లో రెండున్నర కిలోల గోధుమల ధర ఎంతో ఉందో అంత ఫిత్ర ఇవ్వాల్సి ఉంటుంది. జకాత్ ఫిత్రా దానాలు ప్రతీ ముస్లిం స్త్రీ, పురుషులకు విధిగా (వాజిబ్) నిర్ణయించబడ్డాయి. ముస్లింలు తమ సంపాదనలో 25వ వంతు దానం చేయడమే జకాత్. కాగా.. రంజాన్ ప్రార్థనలకు కరీంనగర్ జిల్లాకేంద్రంలో పురానీ ఈద్గాతోపాటు సాలేహ్‌నగర్, చింతకుంట, బైపాస తదిరత ప్రాంతాల్లో గల ఈద్గాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

గ్రూప్‌–1లో మెరిసిన జిల్లావాసులు

- ఎస్సీ కోటాలో హరిణికి మొదటి ర్యాంకు



తల్లిదండ్రులతో కన్నం హరిణి

కరీంనగర్: టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్‌–1 ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన కన్నం హరిణి రాష్ట్ర స్థాయిలో 55వ ర్యాంక్ సాధించింది. ఎస్సీ కమ్యూనిటీలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించింది. కరీంనగర్ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కన్నం రమేశ్ రామడుగు మండలం వెలిచాల జెడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు. భార్య కళాప్రపూర్ణ జ్యోతి రామడుగు జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయురాలు. వీరిది సొంతూరు బోయినపల్లి మండలం అనంతపల్లి. వీరి కూతురు గ్రూప్‌–1 పరీక్ష రాయగా ఆదివారం వెలువడిన ఫలితాల్లో జోన్‌–1లో డిప్యూటీ కలెక్టర్ పోస్టు పొందేందుకు అర్హత సాధించింది. హరిణిని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బీటీఎఫ్ నాయకులు కొమ్ము రమేశ్, మానుపాటి రాజన్న, చిలుక దేవశంకర్, బెజగం రమేశ్, మానుపాటి రాజయ్య, మేకల స్వరూప అభినందించారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం



భూషిత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: గ్రూప్‌–1 ఫలితాల్లో పెద్దపల్లి పట్టణానికి చెందిన పొందుగుల భూషిత్ రెడ్డి 76వ ర్యాంకు ను సాధించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన పొందుగుల విజయలక్ష్మి – భాస్కర్‌రెడ్డి దంపతుల కుమారుడు భూషిత్‌రెడ్డి.. సివిల్స్ సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే రెండుసార్లు ప్రయత్నించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బెంగళూరులో ఇన్‌కంట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేందుకు ఓ వైపు పనిచేస్తూనే మరోవైపు కఠోర దీక్షతో చదువుతున్నారని తల్లిదండ్రులు విజయలక్ష్మి, భాస్కర్‌రెడ్డి తెలిపారు.



తల్లిదండ్రులతో భూషిత్‌రెడ్డి

ఏసీపీ కొడుక్కు 80వ ర్యాంకు..

- ఇప్పటికే అగ్రికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పాలకుర్తి సందీప్



పాలకుర్తి సందీప్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీసీఎస్ ఏసీపీ పాలకుర్తి కాశయ్య కుమారుడు పాలకుర్తి సందీప్ గ్రూప్‌–1 ఫలితాల్లో 80వ ర్యాంకు సాధించాడు. కరీంనగర్‌లో ఇంటర్ వరకు చదివి, తమిళనాడులో అగ్రికల్చర్ బీఎస్సీ, రాజేంద్రనగర్‌లోని జయశంకర్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసిన సందీప్ అగ్రికల్చర్ ఆఫీసర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ఏవోగా విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపనతో తల్లిదండ్రులు భాగ్యలక్ష్మీ, కాశయ్య సూచనలు, ప్రోత్సాహంతో గ్రూప్‌–1 ఉద్యోగానికి ప్రిపేర్ అయి విడుదలైన ఫలితాల్లో 80 ర్యాంకు సాధించాడు. సందీప్ సోదరుడు సంజయ్ అమెరికాలో పీహెచ్‌డీ చేస్తుండగా.. సోదరి సింధు చెన్నైలో ఎంబీబీఎస్ హౌజ్ సర్జన్ చేస్తోంది. సందీప్‌కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

125వ ర్యాంక్



చిర్రం మహేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన చిర్రం అంజయ్య–మల్లవ్వ దంపతుల రెండో కుమారుడు చిర్రం మహేశ్ గ్రూప్‌–1లో 125వ ర్యాంక్ సాధించాడు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న మహేశ్.. ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. రాష్ట్రస్థాయిలో 125వ ర్యాంక్ సాధించాడు.

సురక్షితం.. సులభతరం

- విద్యుత్‌శాఖలో డిజిటల్ చెల్లింపులు
- సులభతరంగా ఆన్‌లైన్ చెల్లింపులు
- టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ రూపొందించిన సంస్థ
- సమయం ఆదా.. ఎక్కడి నుంచైనా చెల్లించే అవకాశం

టీజీఎన్‌పీడీసీఎల్ లోగో

కొత్తపల్లి(కరీంనగర్): ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం నూతన పుంతలు తొక్కుతోంది. ఆ సాంకేతికతను ప్రజలకు అందించేందుకు నిపుణులు విశేషంగా ప్రయత్నిస్తున్నారు. యూపీఐ, ఆన్‌లైన్ చెల్లింపులు సులభతరం అయ్యాయి. అందులో భాగంగానే విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సంస్థ యాప్‌ను రూపొందించింది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు రెవెన్యూను సమకూర్చుకునేందుకు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. బిల్లుల చెల్లింపులో సమయం వృథా కావొద్దనే ఉద్దేశంతో టీజీఎన్‌పీడీఎల్ యాప్‌ను రూపొందించింది. కొన్నేళ్లుగా ఈ యాప్ ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ వినియోగదారులు ఆశించినస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదు. ప్రస్తుతం యాప్‌ను విద్యుత్ సంస్థ మరింతగా అభివృద్ధి చేసింది. నెలవారి విద్యుత్ బిల్లులు యాప్ ద్వారా సురక్షితంగా, సౌకర్యవంతంగా, సులభంగా చెల్లించవచ్చు.

ప్లే స్టోర్‌లో ఆండ్రాయిడ్ వర్షన్

యాప్‌ను ఆండ్రాయిడ్ వెర్షన్‌లో డెవలప్ చేసింది. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు కలిగిన వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టీజీఎన్పీడీసీఎల్ యాప్‌లోకి వెళ్లి వినియోగదారుని యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేసుకొని బిల్లు చెల్లించవచ్చు. ఈ విధంగా ప్రతి నెల జెనరేట్ అయ్యే బిల్లు తాలుకు సమాచారం ఆటోమేటిక్ వస్తుంది. ఇది ఇంట్లోనే ఉండి కేవలం రెండు నిమిషాల వ్యవధిలో చెల్లించవచ్చు. ఇప్పటి వరకు కరీంనగర్ సర్కిల్‌లో 1,27,339మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. తద్వారా రూ.1327.84 లక్షల చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా జరిగాయి.

ఆన్‌లైన్ చెల్లింపులు చేయండి



వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించి సమయం ఆదా చేసుకోవాలి. మెరుగైన విద్యుత్ అందించేందుకు సంస్థకు సహకరించాలి. వేసవిలో బయటకు రాకుండా, క్యూలైన్‌లో నిలబడి సమయం వృథా చేసుకోకుండా ఇంటి వద్దే సురక్షితంగా యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించండి.
– మేక రమేశ్‌బాబు, ఎస్ఈ కరీంనగర్ సర్కిల్

ఆస్తి పన్ను చెల్లించని రెవెన్యూ గార్డెన్ సీజ్

- కరీంనగర్ గోదాంగడ్డలో సిబ్బందిపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు



రెవెన్యూ క్లబ్‌ను సీజ్ చేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

కరీంనగర్ కార్పొరేషన్: ఆస్తి పన్ను గడువు ముగుస్తుండటంతో కరీంనగర్ నగరపాలక సంస్థ పన్నుల వసూళ్లను ముమ్మరం చేసింది. ఆదివారం కూడా అధికారులు పన్నులు వసూలు చేశారు. నోటీసులు ఇచ్చినా స్పందించకుండా ఆస్తి పన్నులు కట్టని పలు ప్రాపర్టీలను సీజ్ చేశారు. పలు గృహాలు నల్లా కనెక్షన్లు తొలగించారు. కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని రెవెన్యూ క్లబ్, రెవెన్యూ గార్డెన్‌కు సంబంధించిన ఆస్తి పన్ను దాదాపు రూ.87 లక్షలు చెల్లించాల్సి ఉండటంతో గతంలోనే నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇచ్చిన నోటీసుల గడువు ముగిసినప్పటికీ పన్ను చెల్లించక పోవడంతో సంబంధిత రెవెన్యూ క్లబ్, గార్డెన్ ప్రాపర్టీలకు ఆర్వో భూమానందం ఆధ్వర్యంలో సీజ్ చేశారు. 34వ డివిజన్ గోదాంగడ్డ ఏరియా హనుమాన్ ఆలయం సమీపంలో బకాయి ఆస్తి పన్ను చెల్లించాలని అడిగిన వార్డు అధికారి, సపోర్టింగ్ ఉద్యోగిపై ఆంథోని అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. సపోర్టింగ్ ఉద్యోగిపై దాడి చేసి అతని బైక్‌ను ధ్వంసం చేశాడు. విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్‌కు తెలియజేసి, దాడి చేసిన వ్యక్తిపై టూ టౌన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బల్దియా వర్సెస్ ఈఈ

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థలో ఈఈ యాదగిరి ఇతర అధికారుల నడుమ నెలకొన్న వివాదం సంచలనంగా మారింది. యాదగిరి ఇంటి పన్ను వసూలు వ్యవహారం ఆయన నివాసం ఉండే హౌసింగ్ బోర్డుకాలనీలో కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆదివారం పన్నువసులలో భాగంగా నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం, డిజాస్టర్ వాహనాలతో కలిసి యాదగిరి ఇంటికి వచ్చారు. ఇంటి పన్ను చెల్లించాలని లేకుంటే నల్ల కట్ చేస్తామని, సామాన్లు తీసుకెళ్తామంటూ హెచ్చరించారు. అయితే తన ఇంటి పన్ను అధికంగా వచ్చిందని గతంలోనే కమిషనర్ కు దరఖాస్తు చేసుకున్నానని, తగ్గించగానే చెల్లిస్తామని యాదగిరి బదులిచ్చారు. పన్ను చెల్లించాల్సిందేనని అధికారులు పట్టు పట్టడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తమను పుస్తెలు అమ్మి చెల్లించాలని రెవెన్యూ అధికారులు బెదిరించారంటూ యాదగిరి కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాగా రెండు వర్గాలు ఆవేశాలకు లోనై దూషణలకు దిగడంతో రాత్రి 10గంటల వరకు ఉద్రిక్తత కొనసాగింది.

ఆయిల్‌పామ్ వైపు మెట్ట రైతులు

- సాంప్రదాయ పంటలు వీడి నూతన సాగు
- రైతులకు కలిసొస్తున్న తోటలు



కాతకు వచ్చిన ఆయిల్‌పామ్ పంట



ఆయిల్‌పామ్ తోట

ఇల్లంతకుంట(మానకొండూర్): మెట్టప్రాంతం ఇల్లంతకుంట మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుతో లాభాల బాట పడుతున్నారు. ఇన్నాళ్లు సాంప్రదాయ పంటలైన వరి, కూరగాయలు, పత్తి సాగు చేసిన రైతులు.. కొందరు కొత్తగా ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లారు. మండలంలోని ఇల్లంతకుంట, దాచారం, పెద్దలింగాపూర్, పొత్తూరు, గాలిపల్లి, వల్లంపట్ల, రేపాక గ్రామాల పరిధిలో 320 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు.

ఎకరానికి 50 మొక్కలు

ఇల్లంతకుంట మండలంలోని దాదాపు 320 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారు. ఒక ఎకరంలో 50 మొక్కలు నాటుతారు. ఒక మొక్క ధర రూ.193 ఉండగా రైతు చెల్లించేది రూ.20 మాత్రమే. 14 నెలల వయసు ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు రైతులకు ఉద్యానశాఖ అధికారులు సరఫరా చేస్తారు. మొక్క నాలుగేళ్ల వయస్సు వచ్చినప్పటి నుంచి దిగుబడి రావడం ప్రారంభమవుతుంది. మూడేళ్ల వరకు ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటలు సాగు చేసుకునే అవకాశం కూడా ఉంది. పంట విత్తినప్పటి నుంచి నాలుగేళ్ల వరకు ఎరువుల కోసం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎకరానికి ఏటా రూ.4,200 చెల్లిస్తారు. పంటకు డ్రిప్ సిస్టం ద్వారా సాగునీటిని అందించాల్సి ఉంటుంది. పంటకు డ్రిప్ పద్ధతి కోసం అవసరమైన పైపులను ఉద్యానశాఖ సబ్సిడీ రుణం మంజూరు చేస్తుంది. డ్రిప్ కోసం ఇచ్చే రుణంలో ఓసీలు, బీసీలకు 80 శాతం చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఏడాది పొడగున నెలకోసారి పంట చేతికొస్తుంది. ఎకరానికి 8 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ధర ఒక టన్నుకు రూ.20,800 ఉంటుందని ఇల్లంతకుంట మండల ఉద్యానశాఖ క్లస్టర్ ఆఫీసర్ వినయ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆయిల్‌పామ్‌ను అమ్ముకునే సౌలభ్యం ఉందని క్లస్టర్ అధికారి పేర్కొన్నారు. లాభసాటిగా ఉండడంతో రైతులు ఆయిల్‌పామ్ పంట వైపు మొగ్గు చూపుతున్నారు.

వరిసాగులో ఉన్నంత కష్టం లేదు



వరిసాగు కంటే ఆయిల్‌పామ్ సాగు సులభం. వరిసాగు కంటే తక్కువ నీరు అవసర పడుతుంది. సాగుచేసి నాలుగేళ్లు అవుతుంది. పంట రావడం ఇప్పుడిప్పుడే మొదలైంది. నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. వరి సాగులో పడ్డంత కష్టం అవసరం లేదు.
– కదుదుల పద్మ, మహిళా రైతు, వల్లంపట్ల

ముందుకొస్తున్నారు



ఆయిల్‌పామ్ సాగులో ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఎక్కువగా ఉండడంతో రైతులు ముందుకొస్తున్నారు. మండలంలో 320 ఎకరాల్లో సాగవుతుంది. వరికి అవసరమైనంత నీరు ఆయిల్‌పామ్‌లో అవసరం లేదు. పని కూడా చాలా తక్కువగా ఉంటుంది.
– సురేశ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఇల్లంతకుంట

వాట్సాప్ పోస్టుతో బీఆర్ఎస్ నాయకుడిపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా వాట్సాప్‌లో పోస్టు చేసిన బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు తంగళ్లపల్లి ఎస్సై బి.రామ్మోహన్ ఆదివారం తెలిపారు. చిన్నలింగాపూర్ మాజీ ఎంపీటీసీ బైరినేని రామును కించపరిచేలా రామచంద్రాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్ వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేశారు. బైరినేని రాము ఫిర్యాదుతో శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌ను జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు పరామర్శించారు.



పోలీస్ స్టేషన్ వద్ద పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు